ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
మంగళవారం 5 మార్చి 2024



హెచ్‌పీఎస్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, మార్చి 4 : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (బేగంపేట్, రామంతపూర్) 2024-25కు గాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరడం జరుగుతుందని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎస్. మల్లేశం తెలిపారు. లంబాడ 4, ఎరుకుల/చెంచులకు 1, ఇతర గిరిజనతెగలకు 1, మొత్తం 6 ఖాళీలు ఉన్నాయన్నారు. జిల్లా వాస్తవ్యులై ఉండాలన్నారు. వివరాలకు 8639388553, 9908598481 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



సీఎం బహిరంగసభకు స్థల పరిశీలన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఐటీ హబ్ పనులకు శ్రీకారం

» 9న కండ్లకోయకు సీఎం రేవంత్‌రెడ్డి రాక

మేడ్చల్ టౌన్, మార్చి 4: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ వద్ద ఐటీ హబ్‌ను ఈనెల 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఐటీ హబ్ ప్రాంతాన్ని జడ్పీచైర్‌పర్సన్ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్‌లతో కలిసి జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి బహిరంగ సభాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడేళ్ల క్రితం అప్పటి ఐటీశాఖ మంత్రి కేటీఆర్ కండ్లకోయ సమీపంలో ఐటీ పార్కు శంకుస్థాపన చేసి వదిలేశారన్నారు. ఐటీహబ్ పనులను తిరిగి తమ ప్రభుత్వం ప్రారంభించనుందన్నారు. ఐటీ హబ్‌తో ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి లభించనుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హనుమంత్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, పోచయ్య గుండ్లపోచంపల్లి కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్, నరేందర్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధరణి స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గడువులోగా దరఖాస్తులు పరిష్కరించాలి

» జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్/పరిగి, మార్చి4 : నిర్ణీత గడువు లోపు ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఈనెల 9వ తేదీ వరకు ధరణి దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఇదిలా ఉంటే ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, ఏపీవోలు, టీఏలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాబ్ కార్డు ఉన్న వారికీ పని కల్పించాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలాల వారీగా ఎన్ఆర్ఈజీఎస్ పనుల ప్రగతిపై చర్చించారు. అంతేకాకుండా జిల్లాలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. టెలికాన్ఫరెన్సు ద్వారా జిల్లాలో జరిగే అభివృద్ధి పనులపై సమీక్షించారు. బొంరాస్‌పేట్, కొడంగల్ మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం పరిగిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, ఛీఫ్‌సూపరింటెండెంట్ మక్బూల్, డీవో లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఈనెల 4వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనుంది. అయితే మెగా డీఎస్సీ ప్రకటనలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు పెరుగుతాయని ఎంతో ధీమాగా ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు కొత్త డీఎస్సీ నోటిఫికేషన్‌తో డీలా పడ్డారు. ఒక ఉపాధ్యాయ పోస్టుకు 50 నుంచి వంద మంది వరకు పోటీ పడే అవకాశం ఉంది.

స్కూల్ అసిస్టెంట్ పోస్టులపై అసంతృప్తి

ప్రాథమిక పాఠశాలల్లో బోధించేందుకు సెకండరీ గ్రేడ్ టీచర్లు, ఆరు నుంచి పది తరగతుల వరకు బోధించేందుకు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు అవసరం. ప్రాథమిక తరగతులకు బోధించేందుకు డీఎడ్, ఉన్నత తరగతులకు బోధించేందుకు బీఎడ్ అభ్యర్థులు అర్హులు కాగా, గత ఏడాది సెప్టెంబరు నెలలో జారీ చేసిన నోటిఫికేషన్‌తో పోల్చుకుంటే జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఏ మాత్రం పెరగలేదు. గత నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టులనే ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌జీటీ పోస్టులు కొంత వరకు పెరిగినా..స్కూల్ అసిస్టెంట్ పోస్టులు పెరగకపోవడం పట్ల ఆ పోస్టులకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు మండిపడుతున్నారు. మెగా డీఎస్సీ ప్రకటనలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు పెరుగుతాయని ఎంతో ధీమాగా ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు కొత్త డీఎస్సీ నోటిఫికేషన్‌తో డీలా పడ్డారు.

టీచర్ కొలువులకు తీవ్ర పోటీ!

» జిల్లాలో 359 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు
» పెరగని స్కూల్ అసిస్టెంట్ పోస్టులు..
» పెంచాలని అభ్యర్థుల డిమాండ్

భర్తీ చేయనున్న పోస్టులు	
స్కూల్ అసిస్టెంట్లు	: 102
ఎస్‌జీటీ	: 195
ఎల్‌పీటీ	: 23
పీఈటీ	: 05
స్పెషల్ ఎడ్యుకేషన్	
స్కూల్ అసిస్టెంట్	: 06
ఎస్‌జీటీ	: 28
మొత్తం పోస్టులు	: 359

ప్రారంభమైన డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ



వికారాబాద్, మార్చి4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఈనెల 4వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనుంది. డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకునేవారు పరీక్ష ఫీజు కింద రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. వివిధ ఉపాధ్యాయ పోస్టులకు నిర్వహించే డీఎస్సీ పరీక్షలు లోక్‌సభ ఎన్నికల తరువాత నిర్వహించే అవకాశం ఉంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో కొనసాగనున్నాయి. ఏడేళ్లుగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు కొత్తగా జారీ చేసిన నోటిఫికేషన్‌లోనూ జిల్లాలో భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తక్కువగా ఉందంటూ మండిపడుతున్నారు.

కేటగిరీల వారీగా పోస్టుల వివరాలు

జిల్లాలో 359 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టుల్లో 102 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 195 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులు, 23 లాంగ్వేజ్ పండిత్, 5 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు ఉన్నాయి. అంతే కాకుండా స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో 6 స్కూల్ అసిస్టెంట్, 28 ఎస్‌జీటీ పోస్టులు భర్తీ చేయనున్నారు. మొత్తం 195 ఎస్‌జీటీ పోస్టుల్లో 169 తెలుగు మీడియం, 26 ఉర్దూ మీడియం పోస్టులు ఉన్నాయి. తెలుగు మీడియం ఎస్‌జీటీ పోస్టుల్లో ప్రభుత్వ పాఠశాలలకు 6, స్థానిక సంస్థల పాఠశాలలకు 163 పోస్టులు కేటాయించారు. ఈ పోస్టుల్లో ఓసీలకు 50, ఎస్సీలకు 24, ఎస్టీలకు16, బీసీ-ఏ కేటగిరికి 13, బీసీ-బీకి 15, బీసీ-సీకి 4, బీసీ-డీకి 10, బీసీ-ఈ కేటగిరికి 6, దివ్యాంగులకు (పీహెచ్) 8 పోస్టులు, ఈడబ్ల్యూఎస్‌కు 16 పోస్టులు కేటాయించారు. లాంగ్వేజ్ పండిత్ హిందీ పోస్టుల్లో మొత్తం 11 పోస్టులు ఖాళీ ఉండగా, ఓసీలకు 4, ఎస్సీలకు 2, ఎస్టీలకు ఒకటి, బీసీ-ఏ, బీసీ-బీ కేటగిరిలకు, దివ్యాంగులకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలకు ఒక్కో పోస్టు కేటాయించారు. సంస్కృతం పోస్టుల్లో భర్తీ చేయనున్న ఒక పోస్టును ఓసీలకు కేటాయించారు. తెలుగు పండిత్ పోస్టులు 8 ఉండగా, వాటిలో ఓసీలకు 4, ఎస్సీలకు 2, బీసీ-ఏ, దివ్యాంగులకు ఒక్కో పోస్టు కేటాయింపు చేశారు. ఉర్దూ పండిత్ పోస్టులు 3 ఉండగా, దాంట్లో ఓసీలకు 2, ఎస్సీలకు ఒక పోస్టు కేటాయించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు 5 ఉండగా, ఓసీలకు 3, ఎస్సీలకు, బీసీ-ఏ కేటగిరికి ఒక్కో పోస్టు కేటాయింపు జరిపారు. 102 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బయోసైన్స్ 21, ఇంగ్లీష్ 23, హిందీ 3, తెలుగు 9, ఉర్దూ 3, ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, ఫిజికల్ సైన్స్ 6 (తెలుగు 4, ఉర్దూ 2), సోషల్ స్టడీస్ 25 (తెలుగు 23, ఉర్దూ 2), తెలుగు 7, ఉర్దూ 2 పోస్టులు ఉన్నాయి.

పోటీలో మూడోస్థానం

జీవో 317 అమల్లో భాగంగా జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయుల కంటే ఇతర జిల్లాల నుంచి వికారాబాద్ జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టులకు పోటీ తీవ్రంగా ఉన్న జిల్లాల్లో వికారాబాద్ మూడో స్థానంలో ఉంది. బీఎడ్, డీఎడ్‌పూర్తి చేసుకుని ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చేస్తున్న అభ్యర్థులు జిల్లాలో ఏడు వేల మందికి పైగా ఉంటారు. ఎస్‌జీటీ పోస్టులకు డీఎడ్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు బీఎడ్ అభ్యర్థులు అర్హులు. ఒక ఉపాధ్యాయ పోస్టుకు 50 నుంచి వంద మంది వరకు పోటీపడే అవకాశం ఉంది.

స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు...

జిల్లాలో 34 స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు భర్తీ చేయనుండగా, వాటిలో 6 స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), 28 ఎస్‌జీటీ పోస్టులు ఉన్నాయి. ఎస్‌జీటీ పోస్టుల్లో ఓసీలకు 9, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, బీసీ-ఏ, బీసీ-బీ కేటగిరిలకు రెండేసి పోస్టులు ఉన్నాయి. బీసీ-సీ, బీసీ-డీ, బీసీ-ఈ కేటగిరిలకు, దివ్యాంగులకు ఒక్కో పోస్టు కేటాయించారు.



నెరవేరిన ఎంఎంటీఎస్ కల

» లింగంపల్లి- ఘట్‌కేసర్‌ల మధ్య ఎంఎంటీఎస్ సేవలు
» నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

ఘట్‌కేసర్, మార్చి 4 : ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఎంఎంటీఎస్ రైలు ఘట్‌కేసర్‌కు వచ్చేస్తుంది. మంగళవారం హైదరాబాద్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లింగంపల్లి - ఘట్‌కేసర్‌ల మధ్య నడిచే ఎంఎంటీఎస్ సేవలను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఎంఎంటీఎస్ రైలు రాక కోసం ఘట్‌కేసర్‌లోని రైల్వేస్టేషన్‌ను ముస్తాబు చేశారు. అయితే ఘట్‌కేసర్ వరకు ఎంఎంటీఎస్ రైలు కోసం నాలుగైదేళ్ల క్రితమే అన్ని పనులు పూర్తయినప్పటికీ రైళ్లు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. గతంలో ఎంఎంటీఎస్ సేవలు చర్లపల్లి వరకే ఉండడంతో ఘట్‌కేసర్ ఎంపీపీ, బీజేపీ నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి ఎంఎంటీఎస్ సేవలు ఘట్‌కేసర్ వరకూ పొడిగించాలని వివరించాడు. దీంతో వారు రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఎంఎంటీఎస్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంది. ఎంఎంటీఎస్ సేవల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇక్కడి ప్రజల కల నెరవేడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంఎంటీఎస్ సేవలు ఘట్‌కేసర్ వరకు రావడం శుభపరిణామని, రవాణ ఇబ్బందులు తీరనున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

● వీఐపీ పాసుల జారీ ఆర్‌డీవోకు అప్పగింత
● ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళిక
● అధిక ధరలు విక్రయిస్తే చర్యలు
● అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి
● కీసరగుట్ట బ్రహ్మోత్సవాలపై సమీక్షలో కలెక్టర్ గౌతమ్

కీసర, మార్చి4: కీసర గుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈనెల 6 నుంచి ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం కీసరగుట్టలోని కల్యాణ మండపంలో కలెక్టర్ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డిలతో కలిసి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయకమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా వీఐపీ పాసులు పరిమిత సంఖ్యలో ముద్రించాలని, ప్రొటోకాల్ ప్రకారం పాసులను ఆర్‌డీవో ఉపేందర్‌రెడ్డి జారీ చేస్తారన్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా పోలీసులు తగిన ప్రణాళిక రూపొందించాలన్నారు. క్షేత్రంపై ట్రాఫిక్ సమస్యలు రాకుండా పాసులు ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలన్నారు. ప్రముఖులు తప్పా, ఎవ్వరికీ కూడా ఎగ్జిట్ నుంచి స్వామివారి దర్శనానికి అనుమతించకూడదన్నారు. దాదాపు 1800 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారన్నారు. జాతరకు 300 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య సిబ్బందికి తగిన వసతులు కల్పిస్తామన్నారు. జాతరకు వచ్చే భక్తుల వద్ద పూజా, తదితర సామగ్రి అధిక ధరకలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కాగా సమావేశానికి ముందు కలెక్టర్ గౌతమ్, ఆయా శాఖల అధికారులతో కలిసి కీసరగుట్ట క్షేత్రంపై కలియతిరిగారు. ఆనంతరం అర్చకులు, నిర్వాహకులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థ ప్రసాదములు, ఆశీర్వచనలు అందజేశారు. కాగా ప్రొటోకాల్ ప్రకారమే పాసులు జారీ చేయాలని జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. కీసరగుట్టపై వసతులు సరిగ్గా ఉండటం లేదని భక్తులు ఆరోపిస్తున్నారన్నారు. కీసరగుట్టకు భక్తుల తాకిడి పెరిగిన నేపథ్యంలో తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ ఆగస్త్య, డీసీపీ పద్మాజా, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో నరేందర్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కోడిగుడ్లను కాల్చివేశారు!

» పొలంలో పారబోసిన ఘటనపై అధికారుల విచారణ
» దొరకని ఆనవాళ్లు.. గుడ్లు ఇక్కడివి కావు : ఐసీడీఎస్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారి జ్యోతిపద్మ

ధారూరు, మార్చి 4: నాగారం గ్రామంలోని రైతు పొలంలో పారబోసిన కోడిగుడ్లను కాల్చివేసి ఆనవాళ్లు లేకుండా చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 3న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పొలంలో అంగన్‌వాడీ కోడిగుడ్లు' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. సోమవారం ఘటనా ప్రాంతానికి శిశుసంక్షేమశాఖ జిల్లా అధికారి జ్యోతి పద్మ, ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరమ్మ వెళ్లి పరిశీలించారు. సుమారు 600 వరకు పొలంలో పారబోసిన అంగన్‌వాడీ గుడ్లను ఆనవాళ్లు లేకుండా కాల్చివేయటంతో బూడిదగా మారాయి. దీంతో కోడిగుడ్లకు సంబంధించి ఆధారాలు లభించలేదు. దీంతో అధికారులు 8 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పారబోసిన కోడిగుడ్లు ఇక్కడివి కావని పేర్కొన్నారు. తాము అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పరిశీలించగా కోడిగుడ్ల లెక్కలు సరిగ్గానే ఉన్నాయని తెలిపారు. కాగా కోడిగుడ్లను ఎవరు.. ఎందుకు కాల్చివేశారనే కోణంలో అధికారులు మాత్రం విచారించలేదని సమాచారం.

కోడిగుడ్ల పై జడ్-6 (చార్మినార్ జోన్) గుర్తు



శనివారం పొలంలో పారబోసిన అంగన్‌వాడీ కోడిగుడ్లపై జడ్-6 అనే ముద్ర ఉంది. జోన్-6 అంటే చార్మినార్ జోన్ కిందకు వస్తుందని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. పెద్ద మొత్తంలో అంగన్‌వాడీ కోడిగుడ్లను ఇక్కడికి ఎలా వచ్చాయి, ఎవరు తెచ్చారనే విషయం అధికారులు తేల్చలేకపోయారు. విక్రయించటానికి తీసుకువచ్చి కోడిగుడ్లపై ప్రభుత్వ ముద్ర ఉండటంతో పారబోశారనే ప్రచారం సాగుతుంది. ఈ వ్యవహారం బయటకు పొక్కడం, ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో ఆనవాళ్లు లేకుండా కోడిగుడ్లను కాల్చివేయటంపై అధికారులు విచారణ చేయాల్సి అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

అపరిష్కృత దరఖాస్తులు పది వేలు!

» జిల్లాలో ధరణి సమస్యల పరిశీలనకు 21 బృందాలు » రైతుల మోముల్లో ఆనందం

మేడ్చల్ మార్చి4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ధరణి పోర్టల్‌తో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 9వ తేదీలోగా వివిధ స్థాయిల్లో పరిష్కరించాలని ఆదేశించడంతో రైతులమోములో ఆనందం కనిపిస్తోంది. జిల్లాలో మ్యూటేషన్‌లు, వారసత్వ సమస్యలు, నాలా కన్వర్షన్, సక్సెషన్, పీవోబీ సమస్యలు, పాసు పుస్తకాల్లో సవరణలు, కొత్త పాసుపుస్తకాల జారీకి సంబంధించి దాదాపు 10 వేల దరఖాస్తులు పెండింగ్‌లో సమస్యలున్నాయి. అయితేఅధికారుల దృష్టికి రాని వేల సమస్యలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో భూ సమస్యలను ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా తొమ్మిది రోజుల్లో పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇంత తక్కువ వ్యవధిలో పరిష్కారం, సాధ్యమేనా అని ఆందోళన వ్యక్తమౌతున్నా.. భూ సమస్యల పరిష్కారానికి ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధరణి దరఖాస్తుల ఆమోదం, తిరస్కరణలకు సంబంధించి కలెక్టర్‌కు మాత్రమేఉన్న అధికారాలను విభజించారు. ఒకవేళ దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు గల కారణాలను భూ యజమానులకు తెలుపాలని ప్రభుత్వం స్పష్టం చేయడంతో పారదర్శకంగా ప్రక్రియ కొనసాగే అవకాశముంది.

పరిశీలనకు బృందాలు

జిల్లాలో ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న భూ సమస్యల పరిష్కారానికి మండలాల వారీగా బృందాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్, డీటీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో మూడేసి బృందాలను పనిచేయనున్నాయి. సర్వేయర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణ అధికారులను కూడా ఈ పనులకు వినియోగిస్తున్నారు. తొమ్మిది రోజుల కార్యాచరణలో తొలిరోజు రెవెన్యూ డివిజన్లు, మండలాల వారీగా దరఖాస్తులు వేరు చేశారు. కొన్ని మండలాల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు కూడా సిబ్బంది వెళ్లనున్నారు.



శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి(ఫైల్)



గడువులోగా సమస్యలు పరిష్కరిస్తాం

ప్రభుత్వం ఆదేశించిన గడువులోగా ధరణి పోర్టల్ ద్వారా రైతుల సమస్యలు పరిష్కారిస్తాం. ఈ నెల 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, సమస్యలను ఏవిధంగా పరిష్కారించాలని ఆర్‌డీవోలకు, తహసీల్దార్లకు అవగాహన కల్పించాం. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులనే కాకుండా, ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం.

- గౌతమ్, మేడ్చల్ కలెక్టర్

రోడ్డు భద్రతపై అవగాహన

కొడంగల్, మార్చి 4: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎస్‌ఐ భరత్‌రెడ్డి ఆదేశానుసారం హెడ్‌కానిస్టేబుల్ శివరాములుగౌడ్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాజారాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలెపల్లి ఆలయ హుండీ లెక్కింపు


రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీని లెక్కిస్తున్న ఆలయ నిర్వాహకులు

బొంరాస్‌పేట్, మార్చి 4: తెలంగాణలో మినీ మేడారంగా పిలువబడే దుద్యాల మండలంలోని పోలెపల్లి జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. సోమవారం దేవాదాయ ధర్మదాయ శాఖ కొడంగల్ ఈవో బాల్‌రాజ్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో రూ.4,87,607లక్షలు రాగా గత సంవత్సరం కంటే రూ.68,817 అధికంగా వచ్చినట్లు చెప్పారు. వెండి 571గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్‌జయరాములు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

పోలెపల్లి ఎల్లమ్మ దేవత పల్లకీ సేవను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని పల్లకీలో ఉంచి గ్రామంలోకి చేర్చడం పల్లకీ సేవ ఉద్దేశమని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారిని ఆలయం నుంచి తిరిగి గ్రామంలోకి తీసుకెళ్లడంతో జాతర ఉత్సవాలు ముగిశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థిని ప్రతిభ


ప్రశంసాపత్రంతో రాపోలు నేత్రవర్షిణి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 4: మండలంలోని మర్రిపల్లిగూడకు చెందిన చిన్నారి రాపోలు నేత్ర వర్షిణి మార్షల్ ఆర్ట్స్ కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో ఆదివారం రాత్రి విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఇన్విజిలేటర్ నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్-2024 కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన నేత్ర వర్షిణి తొలిస్థానంలో నిలిచింది. చిన్నారికి ప్రశంసాపత్రం ప్రదానం చేశారు. నేత్రవర్షిణి ఘట్‌కేసర్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో 3వ తరగతి చదువుతోంది. ఉపాధ్యాయులు, క్రీడాకారులు, స్నేహితులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు నేత్రవర్షిణిని అభినందించారు.

8 నుంచి మల్లికార్జున స్వామి ఆలయంలో

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



ఎక్వాయపల్లిలో మల్లికార్జునస్వామి ఆలయం

కడ్తాల్, మార్చి 4 : మండల పరిధి ఎక్వాయపల్లి సమీపంలో గల మల్లన్నగుట్టపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శివరాత్రి సందర్భంగా ఏటా ఇక్కడ బ్రహ్మోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తారు. ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రధాన ధర్మకర్త బెల్లి ఎట్టయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కొండపై వెలసిన మల్లన్నస్వామి ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు కడ్తాల, ఆమనగల్లు, కల్వకుర్తి, తలకొండపల్లి, యాచారం, మాల్ మండలాల నుంచి భక్తులు తరలివస్తారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ నిర్వాహకుడు ఎట్టయ్య యాదవ్ వివరించారు. 8న గణపతి పూజ, పంచామృతాభిషేకం, శివపార్వతుల కల్యాణం, ఒగ్గుకథ, 9న అగ్నిగుండాలు, 10న ప్రత్యేక పూజలు, రథోత్సవం, 11న అర్చనలు, విశేష పూజలు, ఒగ్గు కథ, 12న చక్రతీర్థం తదితర కార్యక్రమాలుంటాయని వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ఆలయంలో కొలువు దీరిన సతీ సమేత మల్లన్నస్వామి

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

- మహేశ్వరంలో ఈ నెల 7 నుంచి 11 వరకు ఉత్సవాల నిర్వహణ
- ఏర్పాట్లపై జడ్పీ చైర్‌పర్సన్ అనిత సమావేశం

మహేశ్వరం, మార్చి 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు కృషిచేయాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్ రెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం మండల పరిషత్‌లో ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీత అధ్యక్షతన అధికారులతో బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వరాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమయ్యే ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ కమిటీకి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు సహకరించాలన్నారు. ఉత్సవాల సమయంలో భక్తులకు తాగునీరు, వైద్యం, రవాణ, పార్కింగ్, పారిశుధ్యం, లైటింగ్, తదితర వసతుల్లో లోటుపాట్లు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానికులే కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివస్తారని, ఇందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు జిల్లా పరిషత్ నుంచి రూ.5లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.2లక్షల చొప్పున కేటాయిస్తామన్నారు. అలాగే మహేశ్వరం రాజరాజేశ్వరాలయాన్ని రానున్న రోజుల్లో పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, సీఐ హెచ్.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీవో రవిందర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కూనయాదయ్య, పోతర్లసుదర్శన్ యాదవ్, కాకి ఈశ్వర్, నాయకులు దోమ శ్రీనివాస్‌రెడ్డి, అంద్యానాయక్, లాజర్, ఆజమ్, శ్రవణ్, రాఘవేందర్‌రెడ్డి, రాఖేష్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

కీసర, మార్చి 4 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని డీఆర్వో హరిప్రియ అన్నారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి అన్ని మండలాల నుంచి 98 ఫిర్యాదు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆయా శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత కార్యాలయాలకు అందజేస్తామని, మండల అధికారులు విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తారని ఆమె తెలిపారు.



మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న అధికారులు

సహజ వనరులను సంరక్షించాలి : కలెక్టర్‌కు బక్కని లేఖ

షాద్‌నగర్, మార్చి 4: షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న సహజ వనరులు, చారిత్రక కట్టడాలను సంరక్షించాలని తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు లేఖ రాశారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న కుంటలు, చెరువులు, ఫీడర్ చానళ్లను కూడా వ్యవసాయేతర భూములుగా మార్చడం తహసీల్దార్లకు నిత్యకృత్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలోని చారిత్రక కట్టడాలను కూల్చడం, ప్రకృతి సౌందర్యంగా నిలిచిన బావులను కూల్చి వాటిని సెప్టిక్ ట్యాంక్‌లుగా మారుస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాపై తాను పలుమార్లు అధికారులకు లిఖిత, మౌళిక పూర్వంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చే ముందు రెవెన్యూ శాఖ అధికారులు వాటి పూర్వాపరాలను తెలుసుకొని అనుమతులు ఇవ్వాలని లేఖలో నర్సింహులు కోరారు.



మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

ఓవర్ లోడ్ లారీలను నిలిపివేయాలి



ఓవర్ లోడ్ లారీని అడ్డుకుని పోలీసుస్టేషన్‌కు తరలించిన అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు రూరల్, మార్చి 4 : తాండూరు ఏరియా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే సిమెంట్, నాపరాతి ముడి సరుకు ఓవర్ లోడ్ లారీలను నిలిపివేయాలని తాండూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ గని, కార్యదర్శి అబ్దుల్ షకూర్ పేర్కొన్నారు. సోమవారం గౌతాపూర్ చెక్‌పోస్టు వద్ద లారీ అసోసియేషన్ ప్రతినిధులు కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకుడు పి.నర్సింహులు ఆధ్వర్యంలో కలిసి ఓవర్ లోడ్ లారీలను అరికట్టాలని కోరారు. ఓవర్ లోడ్ ట్రక్కులతో రోడ్లు దెబ్బతింటున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో ఎస్‌ఐ స్పందిస్తూ లారీ అసోసియేషన్ ప్రతినిధులు ఓవర్ లోడ్ పేరుతో లారీలను ఆపొద్దని, సమస్యను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం పోలీసుస్టేషన్ వద్ద లారీ ఓనర్స్ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ.. తాండూరులో 600 వదరకు లారీలున్నాయని, వేరే రాష్ట్రాల నుంచి వచ్చే లారీల్లో సిమెంటు, నాపరాతి, ఎర్రమట్టిని ఓవర్ లోడ్‌తో తీసుకెళ్తుండడంతో పట్టణంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్లు సైతం దెబ్బతింటున్నాయన్నారు. తాండూరు లారీలకు అద్దెలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్, ఆర్టీఏ, ఎస్పీకి, తాండూరు ప్రాంతంలోని పెన్నా, ఇండియా, వికాట్ సాగర్, సీసీఐ, చెట్టినాడు తదితర సిమెంటు కర్మాగారాల యాజమాన్యాలకు లేఖలు రాశామన్నారు. ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో అసోసియేషన్ జోనల్ సెక్రెటరీ అఫ్రోజ్, ట్రెజరర్ విజయ్ ఉన్నారు. కాగా లారీ ఓనర్ల సమస్యలపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల నర్సింహులు అన్నారు. ఓవర్‌లోడ్ లారీలను తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లు దెబ్బతింటున్నాయని అన్నారు. వాటిని నియంత్రించేందుకు జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

- పట్టించుకోని వాటర్ మ్యాన్, పంచాయతీ సిబ్బంది
- నీటి వృథాపై గ్రామస్తులు ఆగ్రహం

దోమ, మార్చి 4: ఒక పక్క ఎండలు ముదురుతూ కొన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంటుంటే మరికొన్ని చోట్ల పంచాయతీ సిబ్బంది, వాటర్ మెన్ నిర్లక్ష్యంతో తాగునీరు వృథాగా పోతోంది. నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పాలెపల్లి గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నుంచి తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ నిండిన తర్వాత మోటర్ స్విచ్ బంద్ చేస్తే నీరు వృథా కాదని, ఇతర గ్రామాలకూ నీరు అందుతుందని అన్నారు. గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఉండవంటున్నారు. వాటర్ మ్యాన్, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోక నీరు వృథాగా పోతోందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరారు.



ట్యాంక్ నిండి వృథాగా పోతున్న నీరు

మున్సిపాలిటీ ముందే మురుగు!

పట్టించుకోని తాండూరు బల్దియా అధికారులు



మున్సిపాలిటీ ముందు పారుతున్న మురుగు నీరు

తాండూరు, మార్చి 4 : తాండూరులో మున్సిపాలిటీ ముందు నుంచి వెళ్తున్న ప్రధాన రహదారి అది. అయితే ఈ రోడ్డుపై నిత్యం భారీగా మురుగు నీరు పారుతోంది. కళ్లముందు మురుగు పారుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ముక్కు మూసుకొని వెళ్తున్నారు. ఈ పరిస్థితి తాండూరు మున్సిపాలిటీ అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. తాండూరు పట్టణం విలియా మూన్ చౌరాస్తా నుంచి ఇందిరాచౌక్ మార్గంలో ఎడమ వైపు ఉన్న రోడ్డులో సోయల్ హోటల్ నుంచి రాయల్ కాంటా వరకు గత 15రోజులుగా మురుగు నీరు రోడ్డు మీద పారుతోంది. ఈ రహదారి వెంబడి వెళ్లే వారు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుంటున్నారు. మునిసిపల్ కార్యాలయం వద్దే మురుగు నీరు పారుతున్నా అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.50వేల నుంచి రూ.లక్ష లోపు ఖర్చయ్యే పనిని కూడా చేయించడం లేదని అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికిప్పుడు డ్రెయిన్లు కట్టించకున్నా మురుగు నీరు రోడ్డుపై పారకుండా అయినా చర్యలు తీసుకోకపోవడాన్నిబట్టి అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉందో తెలుస్తోంది. వీఐపీలు వెళ్లే దారి ఇదే. టీ కొట్లకు, చిరు వ్యాపారులకు జరిమానాలు విధించే అధికారులు మురుగు నీరు వదులుతున్న హోటళ్లకు ఎందుకు విధించడంలేదని జనం ప్రశ్నిస్తున్నారు.

రూ.30కే సికింద్రాబాద్.. సేడంకు రూ.10

- తగ్గిన ప్యాసింజర్, డెమ్యూల రైలు చార్జీలు

తాండూరు, మార్చి 4 : పేద ప్రయాణికుల ప్యాసింజర్ రైళ్లు తిరిగి వచ్చాయి. కొవిడ్-19 తర్వాత రైల్వే శాఖలో అనేక మార్పులు వచ్చాయి. అప్పట్లో ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి ఎక్కువ చార్జీలు వసూలు చేశారు. నాలుగేళ్లుగా రైలు ప్రయాణికులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. రైల్వేశాఖ ఎట్టకేలకు ప్యాసింజర్ రైళ్లను యథావిధిగా నడిపి పాత చార్జీలనే వసూలు చేయాలని నిర్ణయించారు. దీంతో తాండూరు నుంచి హైదరాబాద్ (నాంపల్లి), తాండూరు-సికింద్రాబాద్, కర్ణాటక రాష్ట్రంలోని సేడం, గుల్బర్గా, వాడి, యాద్గిర్, కృష్ణ, ముంబయి, పుణె వెళ్లే ప్యాసింజర్ రైళ్ల ప్రయాణికులకు చార్జీలు తగ్గాయి. తాండూరు రైల్వే స్టేషన్ నుంచి చిరు వ్యాపారులు హైదరాబాద్, సికింద్రాబాద్‌లకు రోజూ వదల మంది వెళ్తారు. కర్ణాటక రాష్ట్రం వాడి, చిత్తాపూర్ మహారాష్ట్ర పుణెలకు చిరు వ్యాపారులు వెళ్తుంటారు. వీరికి చార్జీలు తగ్గడంతో ఊరట లభించింది. తాండూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే డెమ్యూ రైలులో గతంలో రూ.50 ఉండగా ప్రస్తుతం చార్జీ రూ.30లకు తగ్గింది. పలు రైళ్లలో కనిష్ఠ చార్జీ రూ.10 ఉంది. ఒకటి నుంచి మూడు రైల్వే స్టేషన్ల వరకు ఇదే చార్జీతో ఉంది. తాండూరు నుంచి సేడం, తాండూరు నుంచి వికారాబాద్, తాండూరు నుంచి వాడికి రూ.10తో ప్రయాణించొచ్చు. తాండూరు మీదుగా డెమ్యూ రైలు కర్ణాటక రాష్ట్రం చిత్తాపూర్ వరకు, ఇటు సికింద్రాబాద్ వరకు నడుస్తుంది. తాండూరు నుంచి వ్యాపారపరంగా సికింద్రాబాద్, హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రం షోలాపూర్, పుణె, ముంబయిలకు వెళ్తుంటారు. రైల్వే శాఖ చార్జీలు తగ్గించడంతో చిరువ్యాపారులు, సాధారణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

101 ట్రాక్టర్ల ఇసుక నిల్వ సీజ్

- కాంపౌండ్‌లో భారీగా ఇసుక కుప్పలు
- అనుమతి ఒక చోట.. డంపింగ్ మరో చోట
- పోలీసులు, మైన్స్ అధికారుల చర్యలు



చెనిగేష్‌పూర్ శివారులోని జ్యోతి బాపూలే పాఠశాల వెనుక రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన 101 ట్రాక్టర్ల ఇసుక కుప్పలు

తాండూరు రూరల్, మార్చి 4 : తాండూరులోని నెహ్రూగంజ్‌లో ఇళ్లు నిర్మించే వారికి ఇసుక అనుమతులిస్తే, ఇదే అదునుగా ఇసుక మాఫియా అక్రమ నిల్వలతో వ్యాపారం చేస్తోంది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో చెనిగేష్‌పూర్ రోడ్డులోని జ్యోతి బాపూలే పాఠశాల భవనం వెనుక చుట్టూ ప్రహరీ గల కాంపౌండ్‌లో అక్రమార్కులు ఏకంగా 101 ట్రాక్టర్ల ఇసుక డంప్ చేశారు. ఇసుక అనుమతులు మంజూరు చేసిన రెవెన్యూ అధికారులు కాగ్నా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అధికారులు పర్యవేక్షించకపోవడంతో ఇసుక వ్యాపారులు భారీ ఎత్తున డంప్ చేశారు. అయితే గత రెండు రోజులుగా పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు, మైన్స్ ఏడీ సామ్యేల్ జాకబ్, కరన్‌కోట ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ప్రత్యేక దృష్టి సారించారు. అయితే తరలించే ఇసుక ట్రాక్టర్‌ను సోమవారం ఎస్‌ఐ పట్టుకుని పరిశీలించారు. ఇసుక అక్రమంగా డంప్ చేసింది వాస్తవమేనని తేల్చారు. అయితే ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు లేఖ రాయడంతో రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. 101 ట్రాక్టర్ల ఇసుక డంప్ చేసినట్లు తేలింది. సర్వే నంబర్-83లోని చెనిగేష్‌పూర్ శివారులో గల నసీర్ అహ్మద్, మున్నాజీ, నజీర్ అహ్మద్ భూమిలో 101 ట్రాక్టర్లు ఉన్నట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేలింది. ఆ ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కరన్‌కోట్ ఏఎస్‌ఐ పవన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చేవెళ్ల బస్ స్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీ!

- వెంటనే ఫోన్ పే ద్వారా రూ.15,400 డ్రా
- పీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు, పట్టించుకోని పోలీసులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): చేవెళ్ల బస్‌స్టేషన్‌లో దొంగల బెడద ఎక్కువైంది. తరచూ దొంగతనాలు జరుగతోన్నాయి. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయాణికుల సంఖ్య పెరిగి చోరీలు పెరిగాయి.మండలంలోని ఊరెళ్లకు చెందిన ఎం.నర్సింహులు ఫిబ్రవరి 27న హైదరాబాద్ వెళ్లేందుకు చేవెళ్ల బస్‌స్టేషన్‌కు వెళ్లాడు. హైదరాబాద్ వెళ్లే బస్సులన్నీ రద్దీతో వస్తున్నాయి. అప్పటికే అరగంట బస్సుల కోసం నిరీక్షించిన నర్సింహులు చివరకు రద్దీగా ఉండే బస్సును ఎక్కాడు. బస్సు ఎక్కే సమయంలో తోపులాటలో అతడి సెల్‌ఫోన్‌ను దొంగలు కొట్టేశారు. కిలోమీటర్ దూరం వెళ్లాక.. 'ఫోన్ పోయింది. బస్సు ఆపండి.' అని అరవడంతో బస్సు ఆగింది. బస్ స్టేషన్‌లో పడిపోయి ఉండవచ్చని వెంటనే బస్సు దిగి బస్‌స్టేషన్‌కు పరుగులు తీశాడు. కానీ.. ఫోన్ దొరకలేదు. దీంతో వెంటనే చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సిమ్ బ్లాక్ చేస్తాం.. మీరు ఇంటికి వెళ్లండని చెప్పారు. దీంతో బాధితుడు అదే రోజు సాయంత్రం అదే ఫోన్ నెంబర్‌తో ఉన్న కొత్త సిమ్‌ను కొన్నాడు. మరునటి రోజు ఫిబ్రవరి 28న ఉదయం ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్‌లో సిమ్ వేసుకున్నాడు. అంతలోనే ఫోన్‌కు(సెల్ నంబరు: 9866413605) రూ.15,500 డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అడగగా.. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నీ ఫోన్ జాగ్రత్తగా ఉంచుకోవడం తెలియాదా? అంటూ అతన్నే దబాయించారు. ఫోన్ చోరీ అయిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని, సిమ్‌బ్లాక్ చేసి ఉంటే తన ఖాతా నుంచి రూ.15,400 డ్రా అయ్యేవి కావన్నారు. బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకోగా షాద్‌నగర్ టోల్‌గేట్ సమీపంలోని పెట్రోల్ బంకులో డబ్బు ఫోన్‌పే ద్వారా డ్రా అయినట్లు స్టేట్‌మెంట్‌లో తేలింది. తన భార్య రెండు నెలల జీతం డబ్బులు పోయినట్లు తెలిపాడు. బ్యాంక్ ఖాతాలో డబ్బు ఎక్కువగా ఉంటే ఎంతో నష్టపోయేవాడినని, పోలీసుల అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగానే తన ఖాతా నుంచి డబ్బులు డ్రా చేశారని బాధితుడు ఆరోపించాడు.

లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే జోరు!

ఉప్పల్, మార్చి 4 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హవానే కొనసాగుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగింటిని మూడు నెలల్లోనే అమలు చేశామన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని సోమవారం ఉప్పల్ నాయకులతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని సీఎం ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 17లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ ఉండబోతోందన్నారు. మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకో వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

యాసంగి సీజన్‌కు ముందస్తు ప్రణాళిక తయారు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 4 : యాసంగి సీజన్‌కు సంబంధించి ముందస్తు ప్రణాళిక తయారు చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఎం సివిల్ సప్లయిస్, డీఎస్వో, వ్యవసాయ శాఖ, లీడ్ బ్యాంక్ మేనేజర్, డీఆర్డీవో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో యాసంగిలో 7,700 ఎకరాల్లో వరి పంట వేశారన్నారు. ఈ విస్తీర్ణాన్ని బట్టి 1,19,350క్వింటాళ్ల వడ్లు కొనుగోలు కేంద్రాలకు వస్తాయని అంచనా వేశామన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో 126 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. సెంటర్లలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని, సరిపడా గన్నీ బ్యాగులు తెప్పించాలని, కొనుగోలు కేంద్రాల్లో కావాల్సిన అన్ని పరికరాలు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పండించిన ధాన్యానికి మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎ-గ్రేడ్ వడ్లకు రూ.2,203, కామన్ గ్రేడ్‌కు 2,083 మద్దతు ధర ప్రభుత్వం ఇస్తోందని ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశానంతరం ఖరీఫ్ 2023-24 సీఎంఆర్ డెలవరీపై రైస్ మిలర్లతో అధికారి సమావేశాన్ని నిర్వహించారు. రైస్ మిల్లర్లు అందరూ ఖరీఫ్‌కు సంబంధించి సీఎంఆర్ రైస్‌ను వెంటనే ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌వో రాజేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



ప్రజాసేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, మార్చి 4: ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో ఆరుగ్యారంటీలకు మున్సిపల్ పరిధిలో 12,330 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆయా దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సరిదిద్దుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. ఈ క్రమంలో మున్సిపల్ కార్యాలయంలో సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, మేనేజర్ చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన ఎంపీపీ



బండి సంజయ్‌తో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 4: బీజేపీ జాతీయ కార్యదర్శి కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి సోమవారం కలిశారు. కరీంనగర్‌లో కొనసాగుతున్న ప్రజాహిత యాత్రలో ఆయన పాల్గొని బండి సంజయ్‌తో పాటు పాదయాత్ర చేశారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా బండి సంజయ్‌కు అభినందనలు తెలిపారు. ఎంపీపీతో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మాజీసర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 4: మండలంలోని అవుషాపూర్ వద్ద వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుకు మరమ్మతు పనులను సోమవారం మాజీ సర్పంచ్ ఏనుగు కావేరిమశ్చేందర్‌రెడ్డి పరిశీలించారు. సర్వీసురోడ్డులో జరుగుతున్న ప్రమాదాలపై పలుమార్లు జాతీయరహదారి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో అధికారులు సర్వీసురోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. ప్రమాదాలు జరుగకుండా వాహనాదారులకు ఇబ్బందులు కలగకుండా సర్వీసురోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. వర్షపునీరు సర్వీసురోడ్డుపై నిలువకుండా దిగువకు వెళ్లేవిధంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏనుగు మశ్చేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



అప్పాయిపల్లిలో గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్, మార్చి 4: రైతులు పశువులకు విధిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జూనియర్ వెటర్నరీ అధికారి వెంకటయ్య తెలిపారు. మండలంలోని అప్పాయిపల్లిలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 103 పశువులకు, 38 గేదెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శేఖర్, ప్రసాద్, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల ప్రచార కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ గౌడ్ రాజీనామా



ప్రవీణ్‌కుమార్ గౌడ్

తాండూరురూరల్, మార్చి 4: తాండూరు మండల బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి వై.ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తన పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీలో తగిన ప్రాధాన్యత లేకపోవడంతో పార్టీ, పదవి నుంచి తప్పుకుంటున్నాని తెలిపారు. పార్టీ సభ్యత్వంతోపాటు పదవికి రాజీనామా చేసి జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు ఫ్యాక్స్ ద్వారా రాజీనామా పత్రాన్ని పంపినట్లు తెలిపారు. రాజీనామాకు ఎవరి ఒత్తిడి లేదని, తన ఇష్టపూర్వకంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు

కులకచర్ల, మార్చి 4: పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా సోమవారం రాష్ట్ర పరిశీలకులు బద్రీనాథ్ మండలంలోని రాంనగర్, బండవెల్కిచర్ల, కులకచర్లలో పర్యటించారు. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారా లేదా? పోలియో చుక్కలు వేసిన పిల్లల చేతి వేలికి మార్కర్‌తో గుర్తు పెట్టారా? అనే విషయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు వాజిహుద్దీన్, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఫార్మాసిస్టు నరేందర్, సిబ్బంది జంగమ్మ, ఆశా కార్యకర్తలు సునిత, లావణ్య, స్వరూప, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బండవెల్కిచర్లలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు బద్రీనాథ్

పాఠశాలకు ఇష్టారీతిన డుమ్మా

- సమాచారం లేకుండా ఉపాధ్యాయుల సెలవులు
- చదువులో వెనుకబడుతున్న విద్యార్థులు

పెద్దేముల్, మార్చి 4: మండలంలోని గొట్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సెలవుల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ పాఠశాలలో 5వ తరగతి వరకు మొత్తం 50 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి బోధించేందుకు ముగ్గురు ఉపాధ్యాయులను నియమించారు. అయితే సోమవారం ఈ పాఠశాలకు వెళ్లి పరిశీలించగా ఒక ఉపాధ్యాయుడు మాత్రమే విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థులూ 34మందే హాజరయ్యారు. పాఠశాలలో ఒక కార్యాలయంతో పాటు మూడు గదులు ఉన్నాయి. ఒక ఉపాధ్యాయుడు ఇంటర్ పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా విధులకు హాజరవుతుండడంతో ఇద్దరు ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కావాల్సివుంది. ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ సోమవారం సీఎల్ పెట్టినట్లు ఒక ఉత్తరం రాసి అక్కడి ఉపాధ్యాయుడికి ఇచ్చాడు. అయితే పాఠశాల ఉపాధ్యాయుడు సెలవు పెట్టాలంటే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సమాచారం ఇచ్చి లీవ్ లెటర్ ఇచ్చి వెళ్లాలి. అదీ ఆయన అనుమతిస్తేనే సెలవు తీసుకోవాలి. అవసరమైతే కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడికి సమాచారం ఇవ్వాలి. అయితే ఇక్కడ ఉపాధ్యాయుడు రాజశేఖర్ మాత్రం లీవ్ లెటర్ పెట్టుకున్నా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడికి సమాచారమే లేదు. తనకు సమాచారం లేదని ఆయన తెలిపారు. ఈ విషయమై మండల విద్యాధికారిని వివరణ కోరగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడికి ముందుగా సమాచారం ఇవ్వాలని అన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉంటే అనుమతి ఇవ్వకుంటే సెలవు పెట్టడానికి వీలు లేదని చెప్పారు. అయితే ఈ నిబంధనలేవీ ఉపాధ్యాయుడు రాజశేఖర్ పాటించలేదు. ఇలాగే చాలా పాఠశాలల్లో కొందరు ఇలాగే సెలవులపై వెళ్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా డుమ్మామాస్టర్లను గుర్తించి వారిపై చర్యలు చేపడితేనే పిల్లల భవిష్యత్తు మెరుగుపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పాఠశాలలో అందరిని ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు చెపుతున్న ఉపాధ్యాయుడు

విరిగిన కుర్చీలు.. ఫిర్యాదుదారుల ఇక్కట్లు

పూడూరు, మార్చి 4: పూడూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల పనితీరు విమర్శలకు దారితీస్తోంది. కార్యాలయంలో ఫిర్యాదుదారులు కూర్చోవడానికి కనీసం కుర్చీలు కూడా సరిగా లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఓ రైతు తన భూ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. అయితే కార్యాలయంలో విరిగిన కుర్చీలు ఉండటంతో కిందే కూర్చుని అధికారులు వచ్చేంత వరకు వేచిచూశాడు. 'ధరణి'తో ఎన్నో ఎళ్లుగా ఉన్న తన సమస్య తీరుతుందా? లేదా? అని దీర్ఘాలోచనలో పడిపోయాడు. అధికారులకు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పరిష్కారం కావడంలేదంటూ వాపోయాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. కార్యాలయానికి వచ్చిన రైతులకు కనీసం కుర్చునేందుకు కూడా కుర్చీలు లేక నేలపైనే కూర్చుంటున్నారు. అధికారులు స్పందించి కార్యాలయానికి వచ్చే వారికి కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో కింద కూర్చున్న రైతు, పక్కనే విరిగిన కుర్చీలు

గౌడవెల్లిలో ఘనంగా మల్లన్న జాతర

మేడ్చల్ టౌన్, మార్చి 4: మండలంలోని మల్లికార్జున స్వామి వారి జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్‌లు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ వేడుకల్లో భాగంగా స్థానికులు పెద్ద ఎత్తున బోనాలను సమర్పించుకున్నారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, దయానంద్ యాదవ్, రమణారెడ్డి సురేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



జాతర ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

యాలాల, మార్చి 4: గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు బుగ్గప్ప, శ్రీనివాసులు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐదారు నెలలుగా గ్రామ పంచాయతీ వర్కర్ల జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. పనికి తగిన జీతం ఇవ్వాలని నిబంధన ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతీ గ్రామ పంచాయతీ కార్మికుడికి రూ.26వేల జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షబీర్, నర్సింహులు, లచ్చప్ప, చంద్రయ్య, ఆశప్ప, రాములు, శ్యామమ్మ, అనంతమ్మ పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమిలో నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

దోమ, మార్చి 4: అయినాపూర్‌లో కోట బురుజును కూల్చిన గ్రామకంఠం భూమిలో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతిస్తున్న సంబంధిత అధికారులు, రియల్టర్లపై బహుజన ఉద్యమకారుడు మల్లన్న సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరాడు. గ్రామకంఠం భూమి విషయమై సంవత్సర కాలంగా పోరాటం చేస్తున్నప్పటికీ మామూళ్ల మత్తులకు అలవాటుపడిన అధికారులు ఇల్లు నిర్మించుకునేందుకు ఆ స్థలంలో అనుమతిచ్చారంటూ ఆరోపించాడు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడి మంగళవారం గ్రామానికి వెళ్లి నివేదికలను సమర్పించాలని అధికారులకు సూచించారని మల్లన్న తెలిపాడు. ఈ కార్యక్రమంలో దోమ మండల బీసీ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్, మాజీ వార్డు సభ్యుడు రాములు, ఆంజనేయులు, వెంకట్రాములు, నర్సింహ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న అయినాపూర్ గ్రామస్తులు

తండాల్లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కులకచర్ల, మార్చి 4: కులకచర్ల మండలంలోని రాంసింగ్, చాకల్‌పల్లి తండాల్లో సోమవారం ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పనులు మంజూరయ్యాయని లింగంపల్లి మాజీ సర్పంచ్ వెంకటయ్యగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రనాయక్, రాంనాయక్, చాకల్‌పల్లి పాల్గొన్నారు.



తాండూరు రూరల్: సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

చంద్రవంచ గ్రామంలో..

తాండూరు రూరల్: మండలంలోని చంద్రవంచ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.10లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్, అంజిలప్ప, అనంతప్ప, నర్సింహులు, బాలకృష్ణ, గోపాల్, ఎల్లప్ప ఉన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

చెత్త కాలనీ!

- మహేందర్‌రెడ్డి కాలనీలో ఎక్కడ వేసిన చెత్త అక్కడే..

బషీరాబాద్, మార్చి 4: మండలంలోని నవాల్గ పంచాయతీ మహేందర్‌రెడ్డి కాలనీలో చెత్తచెదారం పేరుకుపోతోంది. అపరిశుభ్రంగా తయారై రోగాలు ప్రబలుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యకం చేస్తున్నారు. ఇళ్ల మధ్య చెత్తచెదారం, మురికి కాల్వలతో దుర్వాసనతో దోమలు వృద్ధిచెంది రాత్రుల్లో దాడి చేయడంతో జ్వరాలు వస్తున్నాయని స్థానికుడు అంజి ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు రోజులుగా తన కుమారుడు అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలైనట్లు ఆందోళన వ్యకం చేశారు. ఈ విషయమై సంబంధిత కార్యదర్శికి విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదని అంజితో పాటు కాలనీవాసులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



ఇళ్ల సమీపంలో పేరుకుపోయిన చెత్త

రేపు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

పరిగి, మార్చి 4: పరిగి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఈనెల 7వ తేదీన బుధవారం పరిగిలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీప్రతినిధులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

11న ఐటీఐలో అప్రెంటిస్‌షిప్

వికారాబాద్, మార్చి 4: వికారాబాద్ ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ 2024 మార్చి 11న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.నరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఇంటర్మీడియట్, ఒకేషనల్, డిగ్రీ డిప్లమా, బీటెక్, పూర్తి చేసిన అభ్యర్థులు ఈమేళాకు హాజరు కావచ్చన్నారు. తోషిబా, మహేంద్ర అండ్ మహేంద్ర, మారుతి సుజుకి, కార్తికేయ ఇండస్ట్రీ, నియాన్, టీఎస్ ఆర్టీసీ, పెన్నార్, వోల్టా గ్రీన్, సౌత్ సెంట్రల్ రైల్వే వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9.30గంటలకు బయోడేటా ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441430963, 8499975115లో సంప్రదించలన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కులకచర్ల, మార్చి 4: కులకచర్లలో సోమవారం ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం సైన్స్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. స్థానిక రామలింగేశ్వర కళాశాలలో 279 మంది విద్యార్థులకు 15 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ కామేశ్వరి తెలిపారు. వివేకానంద కళాశాలలో 214 మందికి 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రాములు తెలిపారు.

క్రైం కార్నర్

కొబ్బరిచెట్టు పైనుంచి పడి.. చికిత్స పొందుతూ యువకుడి మృతి

బషీరాబాద్, మార్చి 4: కొబ్బరిబోండాలు తెంపేందుకు చెట్టెక్కిన యువకుడు ప్రమాదవశాత్తు పడిపోడగా తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మంలంలోని కాశీంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జోగి దత్తాత్రేయ(23) శనివారం ఓ ఇంటి వద్ద ఉన్న కొబ్బరి చెట్టుకు కొబ్బరి బోండాలను కోసేందుకు తన స్నేహితుడితో కలిసి వెళ్లాడు. దత్తాత్రేయ చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో అతడి తలకు బలమైన గాయమైంది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతన్ని వెంటనే తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ దత్తాత్రేయ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

పూడూరు, మార్చి 4: వికారాబాద్ నుంచి మన్నెగూడ వస్తున్న ఓ ఆటో బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఏఎస్‌ఐ సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన వర్త్య కిషన్, ధర్మీబాయి, సురేఖ పని నిమిత్తం వికారాబాద్ వెళ్లారు. తిరిగి ఆటోలో వస్తుండగా వికారాబాద్-మన్నెగూడ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న వర్త్యకిషన్, ధర్మీబాయి, సురేఖలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరించారు.

భార్యను హతమార్చిన భర్త రిమాండ్

పూడూరు, మార్చి 4: అనుమానంతో భార్యను హతమార్చిన భర్తను రిమాండ్‌కు పంపినట్లు చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవనోనిగూడకు చెందిన ప్రవీణ్‌కుమార్ భార్య ప్రమీలపై అనుమానంతో కొట్టి తీవ్రంగా గాయపరచగా, ఆమె చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్న పోలీసులు సోమవారం ప్రవీణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించారు. అనంతరం పరిగి జైలుకు పంపినట్లు ఎస్‌ఐ వివరించారు.

మోపెడ్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తికి గాయాలు

ధారూరు, మార్చి 4: మోపెడ్(లూనా)ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యవక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ధారూరులోని బస్టాండ్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం యాలాల మండలంలోని సంగెం గ్రామానికి చెందిన నల్ల చంద్రయ్య పనినిమిత్తం మోపెడ్‌పై వికారాబాద్‌కు బయల్దేరాడు. ధారూరు కూరగాయల మార్కెట్ నుంచి వస్తూ వికారాబాద్ వైపునకు వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రయ్య తలకు బలమైన గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు చంద్రయ్యను ఆసుపత్రికి తరలించారు. కాగా ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స నిమత్తం హైదరాబాద్‌కు తరలించారు. చంద్రయ్య కుమారుడు నల్ల ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో వ్యక్తి హల్‌చల్.. కేసు నమోదు

బషీరాబాద్, మార్చి 4: మద్యం మత్తులో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి హల్‌చల్ చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బషీరాబాద్ ఎస్‌ఐ రమేష్ సోమవారం తెలిపారు. మండలంలోని ఎక్మాయి గ్రామానికి చెందిన కార్రె మంజునాథ్ అనే వ్యక్తి మద్యం తాగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో ఏదో కేసు విషయంలో ఆరాతీస్తూనే అక్కడున్న పోలీసులపై విరుచుకుపడ్డాడు. అతడికి ఎంత చెప్పినా వినకుండా పోలీసులను దుర్భాషలాడాడు. దీంతో ఎస్‌ఐ బ్రీతింగ్ అనలైజర్ పరికరం తెప్పించి పరీక్షించారు. ఆల్కహాల్ శాతం 180 వరకు చూపించడంతో సదరు వ్యక్తిని మత్తు దిగేవరకూ పోలీస్‌స్టేషన్‌లోనే కూర్చోబెట్టారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతులకు ఏ కష్టమొచ్చినా ముందుంటాం

- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి భౌరంపేట మల్లారెడ్డి



బాబాగూడలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా జెండాను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం నాయకులు

శామీర్‌పేట, మార్చి 4: రైతులకు ఏ కష్టం వచ్చినా ముందుండి పోరాడుతామని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి భౌరంపేట మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం బాబాగూడలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ భారతీయ కిసాన్ సంఘ్ ఉత్తర భారత దేశంలో ప్రభుత్వాలను శాసించే స్థాయిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కౌకుట్ల సరేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి, జిల్లా కోశాధికారి ఎ.వెంకట్‌రెడ్డి, సీనియర్ భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ధరణి' దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



ధరణి స్పెషల్ డ్రైవ్‌లో దరఖాస్తులపై సమీక్షిస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్, మార్చి 4: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధరణి స్పెషల్ డ్రైవ్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ధరణి స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తాండూరు మండలంలో మొత్తం 504దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తహసీల్దార్ చెప్పారు. ఈనెల 9వ తేదీలోగా అన్ని దరఖాస్తులకు సంబంధించి నివేదిక తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐలు రాజారెడ్డి, బాల్‌రాజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన



మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై కార్టున్‌ల ద్వారా వివరిస్తున్న విద్యార్థులు

కొడంగల్ రూరల్, మార్చి 4: కొడంగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మాదకద్రవ్యాల నివారణపై పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ తిరుమలేశ్ తెలిపారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సూచనల మేరకు పేపర్ పప్పెట్‌షో ద్వారా విద్యార్థులకు మదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.